నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 7 మే 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు డప్పులు, బోనాలతో ర్యాలీగా వచ్చి స్వాగతం పలుకుతున్న ప్రజలు

స్థానికేతరులను ఆదరించొద్దు..

- కాంగ్రెస్ పాలనలో కష్టాలు ఎక్కువయ్యాయి..
- ఆర్ఎస్పీ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, మే 6 : స్థానికేతరులను ఎంపీ ఎన్నికల్లో ఓడించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీకృష్ణ గార్డెన్‌లో మాదిగల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మాదిగల ఆత్మగౌరవ సభకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి హాజరై మాట్లాడారు. ముందుగా డప్పు వాయిద్యాలు, మహిళల బోనాలతో వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో స్థానికేతరులైన (ఖమ్మం కు చెందిన) మల్లు అనంతరాములు, మల్లు రవిని, నంది ఎల్లయ్యను ప్రజలు ఎంపీగా గెలిపించారని గుర్తుచేశారు. స్థానికుడు, తుంగభద్ర, కృష్ణా నదుల మధ్య ఇసుకలో అక్షరాలు దిద్దిన విద్యావంతుడు, పేదల కోసం ఉన్నత ఉద్యోగాన్ని వదిలొచ్చిన ఆర్ఎస్పీని ఎంపీగా గెలిపించాలని కోరారు. ఇలాంటి వ్యక్తిని పార్లమెంట్‌కు పంపితే ఆ భవనానికే గౌరవం పెరుగుతుందన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు రైతుబంధు రావడం లేదన్నారు. సాగునీరు అందక పంటలు ఎండుతున్నాయి.. వాటికి కరెంట్ కష్టాలు కూడా తోడయ్యాయన్నారు. భవిష్యత్ బాగుండాలంటే ఆర్ఎస్పీని గెలిపించాలని కోరారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ఆర్ఎస్పీని గెలిపించాలి.. మాజీ ఎంపీ రావుల

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురుకులాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించి లక్షలాదిమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఆర్ఎస్పీని నాగర్‌కర్నూల్ ఎంపీగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎంపీగా గెలిస్తే ఈ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పిస్తారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఆర్ఎస్పీ వంటి సమర్థుడైన నాయకుడు కావాలని.. అందుకు కారు గుర్తుకు ఓటు వేయాలని సూచించారు. అనంతరం పలువురు బీఎస్పీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సభలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, పార్లమెంట్ సోషల్‌మీడియా కన్వీనర్ రంగినేని అభిలాష్‌రావు, మాదిగ ఐక్యవేదిక నాయకులు విజయ్, గోవర్ధన్, గాయకుడు రామనర్సయ్య తదితరులున్నారు.

రాష్ట్రాన్ని ఆగం చేస్తున్న సర్కారు..

ఖిల్లాఘణపురం, మే 6 : అమలు కాని హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధిచెప్పాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని సరోజినీదేవి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన జిల్లా గిరిజన ఆత్మీయ సమ్మేళనానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం సస్యశ్యామలమైందని.. కాంగ్రెస్ వచ్చాక కరువుతో ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. అధికారం చేపట్టి రాష్ట్రాన్ని ఆగం చేస్తున్నదన్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారం చేపట్టిన ప్రభుత్వాన్ని ఎంపీ ఎన్నికల్లో గద్దెదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతును రాజును చేసేందుకు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. గిరిజనుల అభ్యున్నతికి ఎంతో కృషి చేసిందన్నారు. ప్రజలకు మంచి చేసే గులాబీ పార్టీకి ప్రతి కార్యకర్త అండగా ఉండి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. గడపగడపకూ తిరుగుతూ బీఆర్ఎస్ చేపట్టిన పథకాలు, ప్రస్తుత ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును వివరించాలన్నారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో రేవంత్ చేస్తున్న మోసాలను పూసగుచ్చినట్లు వివరించి కారు గుర్తుకు ఓటేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గద్దెదించాలి..

రాష్ట్రంలో పచ్చి అబద్ధాల, దోపిడీ పాలన నడుస్తున్నది. మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీని ఎంపీ ఎన్నికల్లో ఓడించాలి. కాంగ్రెస్ హామీలన్నీ అటకెక్కాయి. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రూ.4వేల పింఛన్ సంగతేమైంది..? పింఛన్లనే పెంచనోళ్లు ఆడబిడ్డల పెండ్లికి రూ.లక్ష, తులం బంగారం ఇస్తామంటే ఎట్లా నమ్ముతారు? అధికారం కోసం సీఎం రేవంత్‌రెడ్డిలాగా అబద్ధాలు, మోసపూరిత హామీలివ్వను.. నిజాలు చెప్పే ఓట్లు అడుగుతా. కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం రద్దవుతుంది. రాజ్యాంగం లేకపోతే పేదల బతుకులు చీకటి యుగంలోకి వెళ్తాయి. బీజేపీ వచ్చాకే దళితులు, మహిళలు, మైనార్టీలపై దాడులు పెరిగాయి. ఎస్సీ వర్గీకరణ చేస్తానని హామీ ఇస్తే ఎమ్మార్పీఎస్ నాయకులు బీజేపీకి మద్దతిస్తున్నారు. కానీ దళితులపై వివక్ష చూపుతున్న పార్టీ ఏదైనా ఉందంటే అది బీజేపీనే. మణిపూర్‌లో మహిళలపై దాడి చేసి నగ్నంగా ఊరేగించిన చరిత్ర బీజేపీది. ఎంపీగా గెలిపిస్తే అట్టడుగు వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా నిస్వార్థంగా సేవ చేస్తా. మన బిడ్డల జీవితాలు బాగుపడాలంటే కాంగ్రెస్, బీజేపీ అబద్ధపు మాటలను నమ్మొద్దు.

- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి

రోడ్‌షోకు భారీగా హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

ఆర్ఎస్పీ విజయం ఖాయం

- ఎంపీ ఎన్నికల్లో సీఎంకు బుద్ధి చెప్పాలి : మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కోడేరు, మే 6 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. కోడేరులో సోమవారం నిర్వహించిన రోడ్‌షోలో ఆర్ఎస్పీతో కలిసి పాల్గొని మాట్లాడారు. రైతులను నమ్మించి మోసం చేసి గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని సూచించారు. కేసీఆర్ హయాంలో వడ్లను గిట్టుబాటు ధరకు కొన్నామని.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2,500 మద్దతు ధరతోపాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామన్న రేవంత్ ఇప్పుడు రైతులు రూ.1,800కే అమ్ముకుంటుంటే ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు. ఒక్క హామీని అమలుచేయని కాంగ్రెస్ పార్టీకి ఓటు ఎలా వేస్తారని ప్రశ్నించారు. లంకె బిందెలున్నాయనుకున్నా అంటాడు.. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి ఇలాంటి చిల్లర మాటలు మాట్లాడి తెలంగాణ పరువు తీస్తున్న ప్రభుత్వాన్ని ఓడించాలని ప్రజలకు సూచించారు. ఓట్ల కోసం కాంగ్రెసోళ్లు వస్తే మహిళలు చీపుర్లతో బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం పాన్‌గల్ మండలం కదిరేపాడుకు చెందిన వీరపాగ కృష్ణయ్య సహా పదిమంది బీఎస్పీ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో కారెక్కారు. వారికి మాజీ ఎమ్మెల్యే బీరం గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ఎస్పీ గెలుపు కోసం బీఎస్పీని వదిలి బీఆర్ఎస్‌లో చేరుతున్నామని ప్రకటించారు. పార్టీలో చేసిన వారిలో కృష్ణయ్య, శాంతిప్రకాశ్, నరేశ్, బాలకృష్ణ ఉన్నారు. రోడ్ షోలో నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఆంజనేయగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రఘువర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, ఎంపీపీ వెంకట్‌రాధ, మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, లిటిల్ సోల్జర్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఆర్ఎస్పీ, చిత్రంలో బీరం

మరికల్‌లో నిర్వహించిన రోడ్‌షోకు భారీగా హాజరైన మహిళలు, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు

కాంగ్రెస్‌కు ఓటేసి గోసపడుతున్న ప్రజలు

- అక్రమాలకు పాల్పడుతున్న నాయకులు
- దసరా వరకే ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి!
- వచ్చే ఏడాది 'మే'లో అసెంబ్లీ ఎన్నికలు..
- నారాయణ పేట మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

మాట్లాడుతున్న పేట జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ మన్నె

మరికల్, మే 6 : కాంగ్రెస్‌కు ఓటేసి ప్రజలు గోసపడుతున్నారని బీఆర్ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు ఓట్లకోసం గ్రామాల్లోకి వస్తే ఆరు గ్యారెంటీలు ఇచ్చాకే ఓటేస్తామని చెప్పాలన్నారు. నారాయణపేట నియోజకవర్గంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నాయకురాలు అరుణమ్మ తన కోడలు పర్ణికారెడ్డికి ఓట్లు వేయిస్తే, పార్లమెంట్ ఎన్నికల్లో కోడలు అత్తకు ఓట్లు వేయిస్తుందని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలే ఇస్తున్నారు తప్పా.. కొత్తగా ఎలాంటి పథకాలు అమలు చేయడం లేదన్నారు. అత్తాకోడళ్లు ఒక్కటై అక్రమాలకు పాల్పడతారన్నారు. ధన్వాడ పెద్ద చెరువులో ఒండ్రుమట్టిని కోడలు అమ్ముకుంటుందన్నదని.. అత్త గెలిస్తే గ్రామాల్లో బీరు, కల్లు షాపులు ఏర్పాటు చేస్తారన్నారు. కేసీఆర్‌కు ఓటెయ్యకుండా తప్పు చేశామని ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మరికల్‌కు మండల కాంప్లెక్స్ భవనం తీసుకొస్తే కమీషన్ల కోసం పనులు ఆపారని, బస్టాండ్ అభివృద్ధిని కూడా అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డికి ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. దసరా వరకే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటారని, తర్వాత కోమటిరెడ్డి, ఉత్తమకుమార్‌రెడ్డి సీఎం కుర్చీ కోసం పోటీపడుతారని జోస్యం చెప్పారు. వచ్చే ఏడాది మే నెలలో మళ్లీ అసెంబ్లీ ఎన్నికలొస్తాయని.. అప్పుడు ఎస్ఆర్ రెడ్డి ఎమ్మెల్యేగా వస్తారని ధీమా వ్యక్తం చేశారు. మహిళలను మోసం చేస్తున్న రేవంత్‌రెడ్డి చెంప ఛెళ్లుమనేలా.. కారు గుర్తుకు ఓటేసి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గౌని సురేఖారెడ్డి, వైస్ ఎంపీపీ రవికుమార్, ఎంపీటీసీ సుజాత, మండల కోఆప్షన్ సభ్యులు మతీన్, తీలేరు సింగిల్‌విండో చైర్మన్ రాజేందర్‌గౌడ్, సంపత్‌కుమార్, నాయకులు హన్మిరెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, రామస్వామి, బసంత్, శ్రీనివాసులు, సూరిటి చంద్రశేఖర్, తిరుపతయ్య, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పిస్తా..

మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కల్వకుర్తి, బీజేపీ అభ్యర్థి గద్వాలకు చెందిన వ్యక్తులు. కానీ నేను పక్కా లోకల్. ఎంతోమంది స్థానికులకు ఉద్యోగాలు కల్పించాం. మళ్లీ అవకాశం ఇస్తే మరిన్ని అవకాశాలు కల్పిస్తాం. పార్లమెంట్‌లో పాలమూరు వాణి వినిపించి ప్రజలకు న్యాయం చేస్తాను. పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా తేవడంలో బీజేపీ.. నిధులు ఇవ్వడంలో కాంగ్రెస్ విఫలమైంది. ఈ ప్రాజెక్టును ప్రారంభించింది కేసీఆరే. ప్రజలు మరోసారి మోసపోకుండా కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలి. దేవుడి పేరుతో ఓట్లు అడుగుతున్న వ్యక్తి ఒకరైతే.. దేవుడిపై ఒట్టు వేసి ఓట్లు అడుగుతున్న వ్యక్తి మరొకరు.. వీరందరికీ ఎంపీ ఎన్నికల్లో మీరే గుణపాఠం చెప్పాలి.

- మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి

గువ్వల ప్రచారం అడ్డగింత

అచ్చంపేటరూరల్, మే 6 : బీఆర్ఎస్ నేతల ప్రచారానికి కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా అడ్డు తగులుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని నల్లమల ఏజెన్సీ లోతట్టు ప్రాంతంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అందులో భాగంగా మన్నెవారిపల్లి గ్రామంలో గువ్వల బాలరాజు ప్రసంగిస్తుండగా.. యువజన కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు పలుమార్లు ఆటంకం కలిగించారు. పోలీసులు వారించినా వినకుండా అలాగే ప్రవర్తించారు. ప్రచారాన్ని అడ్డుకుంటే.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఎక్కడికక్క డ ఎండగడుతామని, దాడులకు పాల్పడితే ప్రజలే బుద్ధి చెబుతారని గువ్వల బాలరాజు హెచ్చరించారు. తమ ప్రచారాన్ని అకారణంగా అడ్డుకుంటే మర్యాదగా ఉండదని సూచించారు. ప్రాణం ఉన్నంత వరకు ప్రజల పక్షానే ఉంటామని స్పష్టం చేశారు. ప్రచారాన్ని అడ్డుకున్న కాంగ్రెస్ నేతలపై చర్యలు తీసుకోవాలని ఆధారాలతో సహా ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

గువ్వల ప్రసంగాన్ని అడ్డుకుంటున్న యువజన కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌రెడ్డి



పింక్ కలర్ బెలూన్స్ ఎగరవేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె

పాడుబడిన పచ్చని మైదానం

- ఐదు నెలలుగా నిలిచిన అభివృద్ధి
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, మే 6 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర అభివృద్ధి అగిపోయిందని, పచ్చని మైదానాలు పాడుబడ్డాయని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. సోమవారం మహబూబ్‌నగర్‌లోని జిల్లా క్రీడా, బాలుర కళాశాల మైదానాల్లో పింక్ కలర్ బెలూన్స్ వదిలారు. అనంతరం ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రచారం చేశారు. వాకర్స్‌తో కలిసి జిమ్ చేసి, షటిల్ ఆడారు. మైదానంలో తిరుగుతూ కారు గుర్తుకు ఓటేసి శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు కేసీఆర్ హయాంలో మండలానికో క్రీడా మైదానం నిర్మించామని గుర్తు చేశారు. మహబూబ్‌నగర్ క్రీడా మైదానానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చేలా ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేశామన్నారు. పద్మావతి కాలనీ, శ్రీనివాస కాలనీ, ఏనుగొండ.. ఇలా ప్రతి వార్డులో పార్కు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. కాగా మీరు చేసిన అభివృద్ధి ఎక్కడికక్కడే ఆగిపోయిందని వాకర్స్ శ్రీనివాస్‌గౌడ్ దృష్టికి తీసుకొచ్చారు.

న్యాయవాదులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

బీఆర్ఎస్‌ను ఆదరించాలి

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి : ఎంపీ మన్నె

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఏప్రిల్ 6 : పదేండ్లల్లో తెలంగాణను ఎంతో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీని ఆదరించి, కారు గుర్తుకు ఓటేసి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. సోమవారం మహబూబ్‌నగర్‌లోని బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమావేశానికి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నెతో కలిసి హాజరై మాట్లాడారు. న్యాయవాదుల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. లాయర్లకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దతిస్తున్నారన్నారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆదరించాలని ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి అభ్యర్థించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంనాథ్‌గౌడ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కెం జనార్దన్, ప్రభుత్వ న్యాయవాది మనోహర్, సీనియర్ న్యాయవాది ప్రతాప్‌కుమార్, ఉమాదేవి, రవికుమార్‌యాదవ్, విజయ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆలోచించి ఓటేయాలి : గువ్వల

అక్కారంలో మాట్లాడుతున్న గువ్వల బాలరాజు

అచ్చంపేట రూరల్, మే 6 : అసెంబ్లీ ఎన్నికల్లో అబద్ధపు హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు విమర్శించారు. సోమవారం నల్లమల లోతట్టు ఏజెన్సీ ప్రాంతాల్లో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపును కాంక్షిస్తూ ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఉదయం నుంచి రాత్రి వరకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గువ్వల మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని, కాంగ్రెస్ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు గమనించాలన్నారు. నల్లమల నడింపల్లిలో పుట్టి పెరిగిన ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించి పార్లమెంట్‌కు పంచాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయకుండానే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసం మళ్లీ ప్రజల వద్దకు వస్తున్నారని.. వారిని నిలదీయాలన్నారు. ప్రజలు ఆలోచించి అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీని ఆదరించాలని.. కారు గుర్తుకు ఓటేసి ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ రాజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహాగౌడ్, నాయకులు సేవ్యానాయక్, రాజేశ్, బొడ్కానాయక్, రవి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం : డీఈ హేమలత

బల్మూరు, మే 6 : గ్రామాల్లో నీటి సమస్యను పరిష్కరిస్తున్నామని అచ్చంపేట డీఈ హేమలత పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పాలిశెట్టిపల్లిలో నెలకొన్న నీటి సమస్యను సిబ్బంది, గ్రామస్తులతో కలిసి పరిష్కరించారు. నీళ్ల కోసం మహిళలు స్టార్టర్లు, పైప్‌లైన్‌లను పగులగొట్టిన వార్త 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైంది. కథనానికి స్పందించిన మిషన్ భగీరథ అధికారులు సోమవారం గ్రామంలో పర్యటించి మినీ వాటర్ ట్యాంక్ ద్వారా నీళ్లు అందించేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ ప్రభుత్వ సొమ్మును ధ్వంసం చేయడం సరైంది కాదన్నారు. కాలనీలకు గేట్ వాల్వ్స్ ఏర్పాటు చేస్తామని, నీళ్లు రాకుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ప్రజలతో మాట్లాడుతున్న డీఈ హేమలత

తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సీ కాలనీలో ఉన్న బోరు మోటర్ కోసం గొడవ జరిగినట్లు ప్రజలు తెలిపారు. డీఈ వెంట ఏఈ మధుబాబు, ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, కార్యదర్శి ధన్‌రాజ్, సిబ్బంది ఉన్నారు.

కారు గుర్తుకు ఓటేయాలని మహిళలను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

అబద్ధపు గ్యారెంటీలతో అధికారంలోకి..

- హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ : ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, మే 6 : అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి.. వాటిని అమలు చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం చతికిలపడిపోయిందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా గద్వాల మున్సిపాలిటీలోని 32, 33 చింతలపేట వార్డుల్లో ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ ముందుకు సాగారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరిగేదని వివరించారు. వార్డు ప్రజలు నీటి సమస్య ఎదుర్కునే వారని, బీఆర్ఎస్ మిషన్ భగీరథతో చెక్ పెట్టిందన్నారు. 150 రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. సీఎం పాలనను గాలికొదిలేసి స్వార్థ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఐదు నెలల కింద తెలంగాణ ఎట్లుండే.. ఇప్పుడెట్లుందో ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. బీజేపీ ఏనాడూ తెలంగాణ ప్రయోజనాలు, రైతాంగం కోసం పని చేయలేదన్నారు. కేవలం హిందుత్వం అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లి మత ఘర్షణలను ప్రేరేపిస్తున్నదన్నారు. అనంతరం ప్రజలతో కలిసి ఎమ్మెల్యే టిఫిన్ చేశారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు నాగిరెడ్డి, దౌలు, శ్రీనివాసులు, నాయకులు కృష్ణారెడ్డి, వేణుగోపాల్, సీతారాములు, రామాంజి, గోవిందు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపిద్దాం

గద్వాల రూరల్, మే 6 : ప్రశ్నించే గొంతుకను గెలిపిద్దామని ఎమ్మెల్యే బండ్ల పిలుపునిచ్చారు. జమ్మిచేడు 4, 5వ వార్డుల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మురళి, నేతలు చెన్నయ్య, గోవిందు, సతీశ్, వేణుగోపాల్, కురుమన్న, సాయి రెడ్డి, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.